# నేడు కొడంగల్‌లో పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటన

**బొంరాస్‌పేట్, డిసెంబర్ 3ప్రభాతవార్త**

కొడంగల్ నియోజకవర్గంలో ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాజేష్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... ఆదివారం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు వారు తెలిపారు. అలాగే సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సమస్యలపై కాంగ్రేస్ పార్టీ నిర్వహించనున్న ధర్నాకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇందుకుగాను నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రేస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో కాంగ్రేస్ నాయకులు వెంకట్రాములుగౌడ్, జయక్రిష్ణ, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## శ్రీకాంతాచారికి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు



**పరిగి డిసెంబర్ 3, ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతా చారి చేసిన సేవలను మారవలేనివని ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పరిగి మున్సిపల్ కేంద్రంలో కొడంగల్ చౌరస్తాలో మలి విడత తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతా చారీ వర్ధంతి వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి హాజరై శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, ఎంపిపి కరణం అరవింద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ కుమార్, జిల్లా సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

# ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

### -తహాసీల్దార్లను ఆదేశించిన కలెక్టర్ నిఖీల



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వారం రోజుల్లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిఖిల తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డిఆర్ఓ అశోక్ కుమార్‌తో కలిసి ప్రత్యేక ఓటర్ సవరణన జాబితా 2023- రూపకల్పనలో భాగంగా ఓటర్ నమోదు, మార్పులు చేర్పులు తదితర అంశాలపై అదేవిధంగా ధరణీలో వచ్చిన దరఖాస్తులపై తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... 18 సంవత్సరాలు నిండిన యువతి ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 8లక్షల 70వేల 202 మంది ఓటర్లు ఉండగా 5లక్షల 8వేల 423 ఓటర్ల ఆధార్ అనుసంధానం చేయడం జరిగిందని మిగిలిపోయిన వాటన్నింటిని గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ నమోదుకై ప్రత్యేక క్యాంపులు నిర్వహించినందున ప్రతి ఇంటికి వెళ్లి మిగిలిపోయిన వారిని ఓటర్ జాబితాలో నమోదు చేసుకునేలా కృషి చేయాలి అన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఓటర్ జాబితాలో పొందుపరిచేలా చూడాలన్నారు. ఓటరు నమోదుపై విద్యాసంస్థలో పెద్ద మొత్తంలో అవగాహన కల్పించి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి**

ధరణిలో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించకుండా చూడాలని కలెక్టర్ తహసీలార్లకు సూచించారు. అర్జిదారులు తప్పుగా దరఖాస్తు చేసుకుంటే ఖచ్చితమైన కారణం తెలుపుతూ తిరస్కరించినట్లయితే మెసేజ్ రూపంలో అర్జీదారులకు సమాచారం చేరుతుందని కలెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నిటిని మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే దిశగా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు కేటాయించిన భూముల సర్వే నెంబర్‌తో పాటు విస్తీర్ణం వివరాల పంచనామా రిపోర్టులను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# దేవరయాంజాల్ దేవాలయ భూములను కాపాడండి

### -అక్రమ కబ్జాలు..జోరుగా నిర్మాణాలు
### -దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు



డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త**

దేవరయాంజాల్‌లోని దేవాలయ భూములు కబ్జాలకు గురై అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నట్లు వెంటనే వాటిని అరికట్టాలని, దేవాలయ భూములను కాపాడాలంటూ తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్ దేవాలయ భూములు సర్వేనెంబరు 639,640లలో గల దేవాలయ భూమి సుమారు 15ఎకరాల వరకు ఉందని, ఆ భూమిలో వందలాదిగ గుడిసెలు వేస్తూనే పక్కా ఇళ్ల నిర్మాణాలు కూడ జోరుగా సాగుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకవెళ్లటం జరిగిందని తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి తెలిపారు. పెద్ద ఎత్తున దేవాలయ భూములలో ఇళ్లనిర్మాణాలు జరుగుతున్నట్లు వాటిని అరికట్టాలన్నారు. నగరంలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనికి డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ ఈ విషయంపై పలుసార్లు చర్చించామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ భూమిని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉందని ఎంత మంది ఇళ్లను నిర్మించినా వాటిని తొలగిస్తామని, దేవాలయ భూమిని కాపాడుతామని ఆయన స్పష్టం చేశారని అన్నారు. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మురళిగౌడ్, రాము, మున్సిపాల్టీ కాంగ్రెస్ ఓబిసి సెల్ అధ్యక్షులు పి.లక్ష్మినారాయణ, హకీంపేట్ 9వవార్డు పార్టీ అధ్యక్షులు జగన్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుర్గయ్య, యూత్ నాయకులు గౌతమ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# దివ్యాంగులు ఏ రంగంలోనూ ఎవరికి తీసిపోరు

### - అదనపు కలెక్టర్ తిరుపతిరావు




కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు.



కార్యక్రమానికి హాజరైన వికలాంగులు, అధికారులు

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 3, (ప్రభాతవార్త) :** దివ్యాంగులు ఏ రంగంలోనూ ఎవరికి తీసిపోరని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యాలను సాధించి విజయాలను సొంతం చేసుకోగలుగుతారని అదనపు కలెక్టర్ తిరుపతిరావు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కారించుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ తిరుపతిరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం అందిస్తున్న సేవలను సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో రాణించాలని కోరారు. విద్యారంగంతో పాటు క్రీడలు, ఉద్యోగాలు, వ్యాపారాలు ఇలా ఏ రంగంలో చూసిన దివ్యాంగులు సమాజంలోని సామాన్యులకు ఎంత మాత్రం తీసిపోకుండా తమ నైపుణ్యాన్ని చాటుకుంటున్నారని, ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ, మరింత ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, తద్వారా అనేక అద్భుతాలు ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. శారీరక లోపం విజయ సాధనకు ఎంతమాత్రం అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మల్చుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లాల్లో దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు పింఛన్లు సహాయ పరికరాలు అందించడం జరుగుతుందని అంతేకాకుండా తీవ్ర బహుళ వైకల్యం కలిగిన దివ్యాంగులకు పునరావస కేంద్రాలలో థేరఫి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సంఘాలకు బ్యాంకుల ద్వారా స్త్రీ నిధి ద్వారా రుణాలు అందిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. అనంతరం ఈజీఎస్, సేర్ప్, మెప్మా కార్యక్రమాలు అమలులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ ప్రభాకర్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియా, అడిషనల్ డీఆర్‌డీఏ నీరజ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 6నుంచి అవుశాపూర్ షానూర్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు



అవుశాపూర్‌లోని షానూర్ బాబా దర్గా దృశ్యం.

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**

వంద సంవత్సరాల చరిత్ర కల్గిన షానూర్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 6 వ తేది నుండి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్ గ్రామంలో హాజరత్ సయ్యద్ శాబుద్దీన్ షానూరి బాబా దర్గా కొన్ని సంవత్సరాలుగా భక్తుల కోర్కెలు తీర్చే దర్గాగా ప్రసిద్ధి చెందింది. దాదాపు వంద సంవత్సరాలు భక్తుల విశ్వాసాలకు మన్నికగా వెలిసిన ఈ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల ఆరు నుండి 8 తేది వరకు జరుగనున్నాయి. హిందు ముస్లీంల ఐక్యతకు ప్రతీకగా ఇక్కడి దర్గా ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి. ఉర్సు ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేస్తారు. ఉర్సు ఉత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాలతో పాటు నగరానికి చెందిన ముస్లీంలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేస్తారు. దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6 వ తేదిన సందల్ ( గంధం ), 7 వ తేదిన చిరాగ్ ( దీపాలు ) తదిపరి రోజున ముస్లీం మతపెద్దలు ఖురాన్ పఠనంచేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తారని నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా దర్గా ఉర్సు ఉత్సవ నిర్వహకులు మీర్ శాబుద్దీన్ అలీఖాన్ ( ఖాజా నవాబ్ ) మాట్లాడుతూ దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## గడ్డమల్లయ్యగూడలో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

### -గోడ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు
### -ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయడానికి వీలు లేదు
### -పంచాయితీ కార్యదర్శి దీపిక

**యాచారం, డిసెంబర్ 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో సర్వే నె ంబర్ 450/ఈ కు సంబంధించిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని గ్రామపంచాయితీ కార్యదర్శి దీపిక అన్నారు. ఈ సర్వే నెంబర్‌లో 34 గుంటల భూమి ఉందని తెలిపారు. ఇందులోనే 21 గుంటల భూమిలో ఖబరస్తాన్, 10 గుంటల భూమిలో పశు వైద్యశాల, 13 గుంటల భూమిలో పోచమ్మ గుడి పేరు మీద ఉందని తెలిపారు. గ్రామంలోని కొంత మంది కుల పెద్దలు సంఘానికి సంబంధించిన భూమి అని, అందుకే సంఘానికి వివిధ అవసరాల నిమిత్తం గోడ నిర్మాణానికి ప్రయత్నించారని, ఈ విషయంపై కొందరు గ్రామస్తులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాధు చేశారని తెలిపారు. ఫిర్యాధు మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించానన్నారు. ఈ సంఘటనపై రెవిన్యూ అధికారుల ఆదేశాల మేరకు కురుమ సంఘం భవన గోడ నిర్మాణాన్ని అడ్డుకున్నామని తెలిపారు. ఈ భూమికి సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లు కురుమ సంఘం వారి దగ్గర లేవని, సదరు భూమిలో గోడ నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

**మేడ్చల్, డిసెంబర్ 3. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని రాజబొల్లారంలో ప్రభుత్వ భూమిని కబ్జాకాకుండా కాపాడాలని కోరుతూ మేడ్చల్ తహసీల్దార్ సరితకు ఆ గ్రామ ప్రజలు వినతి పత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 38లో గల 13 గుంటల భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలని గతంలో ఉన్న తహసీల్దార్‌కు విన్నవించగా సర్వే చేయించి ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించి సర్వే రిపోర్ట్లు కూడ ఇచ్చారని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. కొంత కాలం జాప్యం జరిగిన అనంతరం ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ ఈ నెల 1న ఆ స్థలంలో ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేశారని, కాని అదే రోజు బోర్డును రెవెన్యూ సిబ్బందిచే తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ భూమి అక్రమణదారుల చేతిలోకి వెళ్లకుండా కాపాడి, గ్రామ అవసరాల కోసం వినియో గించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుదర్శన్, కే.మల్లేష్, జి. రమేష్, డి.బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ తహసీల్దార్ సరితకు వినతి పత్రం అందజేస్తున్న రాజబొల్లారం గ్రామ ప్రజలు

# శామీర్‌పేటలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

### -పాల్గొన్న భక్తజనం
### -యజ్ఞ,హోమం ప్రత్యేక పూజలు..అన్నదాన కార్యక్రమం
### -దర్శించుకున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి



బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగ పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, ఎంపిపి, జడ్పీటిసి, సర్పంచు, ఎంపిటిసి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు



బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగ దర్శించుకున్న టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త**

శామీర్‌పేట గ్రామంలో బొడ్రాయి వద్ద నూతన బొడ్రాయి (నాబిశిల) ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఉదయం ఘనంగ కన్నుల పండుగగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తజనం విచ్చేసి దర్శించుకున్నారు. ఆ తరువాత గ్రామ పరిధిలో ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయం వద్ద పోతలింగరాజు విగ్రహం ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల నుంచి ప్రధాన పూజారి జి.మురళిధర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రతిష్టల సందర్భంగ యజ్ఞ, హోమం పూజలు, ప్రత్యేక పూజలు ఘనంగ నిర్వహించి బొడ్రాయి, పోతలింగరాజుల ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు బొడ్రాయి, పోతలింగరాజుల నాభిశిల ప్రతిష్టల సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేట గ్రామ సర్పంచు వి.బాలమణి, పాలకవర్గం వారి ఆధ్వర్యంలో ప్రతిష్టల పూజలు జరిగాయి. బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి విచ్చేసి బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగ దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, సర్పంచు వి.బాలమణి, ఎంపిటిసి డి.సాయిబాబు, ఉపసర్పంచు ఎస్.రమేశ్, పలువురు వార్డుసభ్యులు, కోఆప్షన్‌సభ్యులు, గ్రామ మాజీ సర్పంచులు బి.కిషోర్‌యాదవ్, డి.అరుణ్‌కుమార్, సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, మండల టిఆర్ఎస్ అధ్యక్షులు వి.సుదర్శన్, శ్రీకట్టమైసమ్మ ఆలయ చైర్మన్ బి.ప్రభాకర్‌యాదవ్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు. బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగ టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి విచ్చేసి దర్శించుకున్నారు. ఆయనతో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎం.మహేందర్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మండల కోఆప్షన్‌సభ్యులు ఎండి ముజీబ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ శామీర్‌పేట గ్రామంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శామీర్‌పేట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగ భక్తిపాటలతో మారుమోగింది. ఇక ఆదివారం బొడ్రాయి, పోతలింగరాజుల ప్రతిష్టను పురస్కరించుకుని గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకోనున్నారు.

# కన్నుల పండువలా వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం

### -శ్రీరాధాకృష్ణుల కళ్యాణం-స్వామి రథోత్సవం



ఘట్‌కేసర్‌లో వెంకటేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గీతామందిర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం గీతామందిర్‌లో ప్రణవ పతాకావిష్కరణ, అఖండదీపారాధన వెంకటేశ్వరస్వా మి ఆలయంలో విష్వక్సేనపూజ, పుణ్యహవాచనం, నిత్యోపాసన, వెంకటేశ్వరస్వామికి అభిషేకం, శ్రీశివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞపూజ తదితర పూజలు నిర్వహించారు. శ్రీశివరామకోటి జపయజ్ఞ సర్వాధ్యక్షులు శ్రీసదానంద యోగీశ్వరులు (చింతపండు సంజీవయ్య) ఆధ్వర్యంలో శ్రీఖండవల్లి రమణాచార్యులు, ఎవిఎస్ఆర్‌కె.ఆచార్యులు వైదిక బృందం మంత్రోచ్చారణాల మధ్య ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ వేదికపై శ్రీఅలివేలుమంగ, పద్మావతి, శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితుల మంత్రోచ్చారణాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య కళ్యాణం జరిపించారు. పలువురు దంపతులు పాల్గొని స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి కళ్యాణాన్ని తిలకించి ఆలయంలో స్వామి దర్శనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీలీలారాధాకృష్ణుల కళ్యాణం, సాయంత్రం 6 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామి రథోత్సవం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు బర్ల శశికళ దేవేందర్, కుతాడి రవీందర్, ఆలయ నిర్వహకులు వెంకట్‌రెడ్డి, ఆత్మారాం, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్త, నాయకులు బర్ల రాధాకృష్ణ, శ్రీమద్భగవద్గీతా భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సన్మానం

**మేడ్చల్, డిసెంబర్ 3. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిలోని కండ్లకోయలో శనివారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులను ఘనంగా సన్మానించారు. గ్రామంలోని దివ్యాంగులను గౌరవ ప్రదంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, 9వ వార్డు కౌన్సిలర్ హంస కృష్ణగౌడ్, సానిటే షన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి, బిల్‌కలెక్టర్ సుజాత, అంగన్ వాడి టీచర్లు నాగలత, సుధారాణి, దివ్యాంగులు పాల్గొన్నారు.



కండ్లకోయలో దివ్యాంగులకు సన్మానం

# దేశం, ధర్మం కోసం బిజెపి కృషి

### -హామీల అమలులో టిఆర్ఎస్ ఘోరంగా విఫలం
### -కమీషన్లు దండుకొని దళితబంధు పథకం అమలు
### -బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్ కుమార్



మాట్లాడుతున్న యు. రమేష్ కుమార్

**పెద్దేముల్, డిసెంబరు 3, ప్రభాతవార్త:**

ప్రజా సంక్షేమం కోసం ప్రజల పక్షాన పోరాడుతు దేశం కోసం ధర్మం కోసం కృషి చేసేది బిజేపి పార్టేనని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్ కుమార్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ మురళిక్రిష్ణగౌడ్, సీనియర్ నాయకులు నరేష్ మహరాజ్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో మండల బిజేపి పార్టీ అధ్యక్షుడు సందీప్‌కుమార్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రతి రూపాయి కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని అన్నారు. తాండూరు నియోజకవర్గంలో వనరులు పుష్కలంగా ఉన్న అభివృద్ధి మాత్రము సున్న అని అన్నారు. టిఆర్ఎస్‌లో నెలకొన్న గ్రూపు తగాదాలతో తాండూరుకు రావడానికి అధికారులు జంకుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, ప్రధాని నరేంద్రమోడి చేస్తున్న అభివృద్ధిని చూసి బిజేపిలోకి భారీగా వలసలు ప్రారంభమయ్యాయని అన్నారు. దళిత బందు పథకంలో నాయకులకు కమీషన్లు ఇచ్చుకుంటేనే పథకం అమలు చేస్తున్నారని ఆరోపించారు. నిజమైన అర్హులకు ఇవ్వకుండా ఎమ్మెల్యే వర్గీయులకే ఇస్తున్నారని విమర్శించారు. పల్లెపల్లెకు పైలెట్‌లో ఎన్ని సమస్యలు పరిష్కరించారని ప్రశ్నించారు. రెండవ విడత గొర్రెల పంపిణీ, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూంఇండ్లు, రుణమాఫీ తదితర హామీలలో టిఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రతి కార్యకర్త సమస్యలపై ప్రశ్నించే విధంగా ఉండాలని, బిజేపి అధికారంలోకి వస్తే కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పదవులు లభిస్తాయని అన్నారు. రాబోయే ఎన్నికలలో తాండూరులో బిజేపి జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యకర్తలు సమిష్టిగా కృషిచేస్తే అంతిమ విజయం తమదేనని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బంటారం భద్రేశ్వర్, అసెంబ్లి కన్వీనర్ రజనికాంత్, హరీష్ గౌడ్, సుధీర్‌రెడ్డి, శంకర్, సుదర్శన్‌గౌడ్, రాంచెందర్, విక్రమ్ రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో నందిగామకు జిగేల్..జిగేల్

-జిఎంఆర్ సౌజన్యంతో సోలార్ ఎల్ఈడి బల్బులు ఏర్పాటు



నందిగామ గ్రామపంచాయతీ పరిధి పిట్టెలగూడెంలో సోలార్ ఎల్ఈడి బల్బులు ఏర్పాటు దృశ్యం

**నందిగామ డిసెంబర్3,ప్రభాతవార్త :**
నందిగామ మండల కేంద్రానికి త్వరలో విదు ్యత్ కాంతులు రానున్నాయి.ప్రముఖ జీఎంఆర్ సంస్థ యాజమాన్యం 44వ బైపాస్ జాతీయ రహదారి నుండి అటు పిట్టెల గూడెంకు,ఇటు నందిగామ మండల కేంద్రానికి వచ్చే రహదారికి ఇరువైపులా సోలార్ ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.గ్రామాభివృద్ధే లక్ష్యంగా మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి ప్రత్యేక కృషితోనే సోలార్ ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేస్తున్నట్లు నందిగామ గ్రామపంచాయతీ 14వ వార్డు సభ్యుడు చెన్నయ్య తెలిపారు.కొత్త ఎల్ఈడి సోలార్ బల్బుల ఏర్పాటుతో నందిగామకు కొత్త కాంతులు రానున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు.మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సోలార్ ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేస్తున్న జిఎంఆర్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బిఎస్పి మండల అధ్యక్షుడిగా అనంతయ్య



అనంతయ్యకు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు లింగం

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబర్ 3,(ప్రభాతవార్త):**
జిల్లెడు చౌదరిగూడ బీఎస్పీ మండల అధ్యక్షుడిగా అనంతయ్య ఏకగ్రీవంగ ఎన్నికయ్యారు. శనివారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లింగం అనంతయ్యకు మండల అధ్యక్షుడిగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బీఎస్పీ పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారిస్తే ప్రజలు తమవైపు ఉంటారని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన పదవి భాద్యతలో పార్టీ అభివృద్ధికిక్రుషి చేస్తానని అనంతయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా బీవిఎఫ్ కన్వీనర్ లక్ష్మన్, రాదయ్య, రాధకృష్ణ, సాయిలు, అంతయ్య, అజయ్‌కుమార్, నర్సింహులు, ఉదయ్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ్‌కుమార్

**షాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**
ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ్‌కుమార్ తెలిపారు. బీసీటీఏ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మండలంలో పోతుగల్, తాళ్లపల్లి, రేగడిదోసా ్వడ, హైతాబాద్ పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఈటీ, పండిట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. 317జీవోతో అన్యాయంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు పెట్టుకున్న అర్జీలను వెంటనే పరిష్కరించి తగిన న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

### బహుజన సమాజ్ పార్టీ కొత్తూర్ ప్రాంత నాయకుల ఎంపిక



నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

**కొత్తూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండల బహుజన్ సమాజ్ పార్టీ కార్యవర్గ సమావేశానికి బహుజన సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.లింగం స్వేరో హాజరయ్యారు. షాద్‌నగర్ నియోజకవర్గ ప్రాంత అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ కొత్తూర్ మండల అధ్యక్షులుగా దానని ఇంద్రసేన, ఉపాధ్యక్షులుగా ఎమ్మె శ్రీశైలం కురుమ, కొత్తూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడుగా గట్టు విష్ణు, ఉపాధ ్యక్షుడుగా రేనట్ల జలందర్‌గౌడ్, ఇన్ముల్ నర్వ సెక్టార్ అధ్యక్షుడుగా బుడుగు మల్లేష్ కురుమ, మల్లాపూర్ సెక్టార్ అధ్యక్షు డుగా ఎర్రోళ్ల కృష్ణ ఎన్నికయ్యారు. నియోజకవర్గ అధ్యక్షుడు నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడు తూ.... గౌరవ జిల్లా అధ్యక్షులు లింగం స్వేరో, నియోజకవర్గం అధ్యక్షు డు శ్రీనివాస్‌లకు కృతజ్ఞ తలు తెలియజేశారు. బహుజన సమాజ్ పార్టీని కొత్తూర్ మండలంలో విస్తరిస్తూ బలోపేతం చేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

**శంకర్‌పల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**
శంకర్‌పల్లి మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామంలో చాకలి మల్లేష్‌కు 10రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన జీవనధారమైన ఆటో కోల్పోయాడని తెలుసుకున్న పీఏసీఎస్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్‌రెడ్డి శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేసి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో బోడ వెంకటయ్య, కోమారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రవి, చాకలి ఈశ్వరయ్య, మాణిక్యం ఉన్నారు.



బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

# దివ్యాంగుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి: చైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**
దివ్యాంగుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం పింఛన్ మూడు వేల రూపాయలు అందజేస్తుందని అన్నారు. వారి హక్కులకు భంగం వాటిల్లకుండా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న వికలాంగులకు ఎదైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగులకు శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థలు విరాళంగా అందజేసిన దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ. సురేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, చింతల రాజశేఖర్, బాలగోని వెంకటేశ్ గౌడ్, నాయకులు మోటుపల్లి శ్రీనివాస్, రాములు, ఉపేందర్, అన్వర్, లింగమల్లు, బలనర్సింహ, రాజేశ్, స్మిత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో జరిగిన వేడుకల్లో స్వచ్ఛంద సంస్థలు అందజేసిన దుప్పట్లను వికలాంగులకు పంపిణీ చేస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి

# శ్రీకాంతాచారి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలి

-ఎంసిపల్లి మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన శ్రీబాలాజీ మూడుచింతలపల్లి మండల విశ్వకర్మ సంఘం నాయకులు

-ంండు మండలాల్లో శ్రీకాంతచారి వర్ధంతి కార్యక్రమాలు



మూడుచింతలపల్లి మండల కేంద్రంలో శ్రీకాంతచారి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మండల విశ్వకర్మ సంఘం నాయకులు

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త**
తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన కాసోజి శ్రీకాంతచారి విగ్రహం ఏర్పాటు కోసం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం కేటాయించాలని మూడుచింతలపల్లి మండల విశ్వకర్మ సంఘం నాయకులు మండల తహసీల్దార్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేసి కోరారు. శనివారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్‌చారి వర్ధంతి సందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి విశ్వకర్మ సంఘం మండల నాయకులు నివాళులు అర్పించారు. ఆ తరువాత మూడుచింతలపల్లి మండల తహసీల్దార్‌ను కార్యాలయంలో కలిసి శ్రీకాంతచారి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను కలిసి కోరారు. అయితే మూడుచింతలపల్లి మార్కెట్ యార్డు (అంగడి) వద్ద లేదా, పోతారం చౌరస్తా వద్ద శ్రీకాంతచారి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను కలిసి వారు కోరారు. తెలంగాణ సాధనలో శ్రీకాంత్‌చారి బలిదానం కీలకంగ మారటంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వారు గుర్తు చేశారు. తెలంగాణ మలి ఉద్యమంలో విద్యార్థి నాయకుడు శ్రీకాంత్‌చారి తెలంగాణ సాధన కోసం ప్రాణాన్ని వదిలి తెలంగాణ చరిత్రలో నిలిచారని అన్నారు. శ్రీకాంత్‌చారి విగ్రహం ఏర్పాటుకు తమకు స్థలం కేటాయించాలని విశ్వకర్మ సంఘం మండల నాయకులు తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ ఆ సంఘం అధ్యక్షులు కె.బాలకృష్ణ, పలువురు మండల నాయకులు, వివిధ గ్రామాల విశ్వకర్మ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేటలో శ్రీకాంత్‌చారి వర్ధంతి సందర్భంగ నివాళులు అర్పించిన కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అఫ్జల్‌ఖాన్, పాల్గొన్న నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, పలువురు నాయకులు

**..శామీర్‌పేటలో..**
శామీర్‌పేట మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ మలిదశ విద్యార్థి నాయకుడు కాసోజి శ్రీకాంత్‌చారి వర్ధంతి సందర్భంగ కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి ఎండి అఫ్జల్‌ఖాన్,పలువురు నాయకులు శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శనివారం శామీర్‌పేటలో తెలంగాణ మలిదశ తొలి అమరవీరుడు శ్రీకాంత్‌చారి 13వ వర్ధంతి సందర్భంగ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంధ్ర పాలకుల అడ్డంకులు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఆలస్యం అవుతుండటంతో శ్రీకాంత్ చారి నిప్పు అంటించుకుని తెలంగాణ కోసం ప్రాణాత్యాగం చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, కెసిఆర్ సేవాధళం మండల అధ్యక్షులు ఎండి నిసార్‌అహ్మద్‌ఖాన్, నాయకులు వెంకటేశ, రమేశన, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# స్వాములకు అన్నదానం చేయడం గొప్ప వరం : మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**షాద్‌నగర్, డిసెంబర్ 3, (ప్రభాతవార్త) :**
ఎంతో పవిత్రతతో, నియమాలతో దీక్షలు చేపట్టిన అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం ఒక గొప్ప వరమని, వారికి అన్నదానం చేస్తే సకల పుణ్యాలు పొందవచ్చునని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక శివమారుతి అయ్యప్ప గీతా మందిరంలో నిత్యఅన్నదాన కార్యక్రమాల్లో భాగంగా 16వ రోజు స్వాములకు స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం చాలా గొప్పవిషయమని ఇలాంటి కార్యక్రమాలను గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శివమారుతి అయ్యప్ప గీతా మందిరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అయ్యప్ప భక్తి సమాజం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నిష్టతో అయ్యప్పస్వామికి పూజలు చేసే స్థానిక భక్తులతో పాటు దూర ప్రాంతాల నుంచి షాద్‌నగర్‌కు వచ్చే అయ్యప్ప దీక్షాపరులకు కూడా ఉచితంగా మధ్యాహ్న భిక్ష ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆయన మనసుస్ఫూర్తిగా కోరుకున్నారు. అనంతరం అయ్యప్ప స్వాములకు స్వాయంగా అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కట్ట వెంకటేష్‌గౌడ్, రాములుగౌడ్, మురళీమోహన్, మార్గం రాజేష్, జంగారి రవి, రాజవరప్రసాద్, మధు, భద్రప్ప, నక్కల విజయ్, లక్ష్మన్‌స్వామి, అగ్గనూరు నందు, శ్రీశైలంగౌడ్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



స్వాములకు అన్నం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేసిన తూంకుంట మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు,పాల్గొన్న నాయకులు కె.అంజనేయులు, తదితరులు

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త**
తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని 14వ వార్డుకు చెందిన ఎ.రవి కి సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం మంజూరు కావటంతో లక్ష రూపాయల చెక్కును తూంకుంట మున్సిపల్ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు అందజేశారు. శనివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలో ఎ.రవి ఇటీవల అనారోగ్యంతో ఉండి చికిత్సలు పొందినందున ఆయన ఆర్థిక సహాయంగ లక్ష రూపాయలు మంజూరు కావటంతో సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

**..దివ్యాంగులకు సన్మానాలు..చైర్మన్**
తూంకుంట మున్సిపాల్టీ కార్యాలయంలో దివ్యాంగులను చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు సన్మానించి అభినందించారు. శనివారం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారికి స్వీట్స్ అందజేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. దీనిలో కమిషనర్ జైతురామ్‌నాయక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా లక్ష్మయ్య నియామకం



ఉద్దెమర్రి గ్రామానికి చెందిన ఎతవల్లి లక్ష్మయ్యను మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 3, ప్రభాతవార్త**
మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఎతవల్లి లక్ష్మయ్య (ఉద్దెమర్రి) నియమితులయ్యారు. శనివారం టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని ఆయన అందుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పత్తి కుమార్, మేడ్చల్ ఏ బ్లాక్ ఎస్సీసెల్ అధ్యక్షులు పి.మహేశ్‌కుమార్‌ల సహకారం వారి సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షునిగా నియమించినందుకు సహకరించిన నాయకులకు లక్ష్మయ్య దన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉద్దెమర్రి గ్రామ మాజీ సర్పంచులు డి.వెంకటేశ, పి.బాలనర్సింహ్మా, నాయకులు జహంగీర్, బిక్షపతి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

-చేవెళ్ల జడ్‌పిటిసి మర్పల్లి మాలతి పిలుపు



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేస్తున్న చేవెళ్ల జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ

**చేవెళ్ళ, డిసెంబరు 3, ప్రభాతవార్త**
బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చేవెళ్ళ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను చేవెళ్ళ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ళ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహరించేందుకు నిరంతర సిద్దంగా ఉన్నామన్నారు.బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు.పాఠశాలలోని సౌకర్యాలకు కల్పనకు తన వంతు కృషి చేస్తామన్నారు. చేవెళ్ల పాఠశాలలోని బాలికలు ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి నారికేళ మహాపడిపూజ

**ఘట్‌కేసర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో శనివారం శ్రీఅయ్యప్పస్వామి 18వ నారికేళ మహాపడి పూజ ఘనంగా జరిగింది. ఎదులాబాద్ గ్రామానికి చెందిన గురుస్వామి సామల శ్రీనివాస్ (18వ మహాపడి) ఆధ్వర్యంలో ఎన్ఎఫ్‌సీకాలనీ కమ్యూనిటీ హాలులో అయ్యప్పస్వామి నారికేళ మహాపడి పూజ నిర్వహించారు. ఎన్‌విడి నాగేశ్వరశర్మ గురుస్వామి సారథ్యంలో జరిపిన పూజలో అయ్యప్పస్వామి దీక్షాదారులు, భక్తులు అధిక సంఖ్యలో భక్తి, శ్రద్ధలతో పాల్గొని స్వామిని కొలిచారు. స్వామియే శరణం అయ్యప్ప అనే స్మరణతో పరిసర ప్రాంతమంతా మారుమోగిపోయింది. అయ్యప్పస్వామి పదునెట్టాంబడిని పూలు, పళ్లతో అలంకరించి, ఉత్సవమూర్తికి పంచామృతంతో అభిషేకం చేశారు. అయ్యప్ప శరణుఘోషతో శ్రీనివాస్ గురుస్వామి 18 మెట్లపై కర్పూర హరతులను వెలిగించారు. ఈసందర్భంగా గురుస్వామి శ్రీనివాస్‌ను పలువురు శాలువాలతో సన్మానించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేసి అన్నప్రసాదాన్ని అందించారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు నాగేశ్, దేవేందర్, మణి, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.



ఎన్ఎఫ్‌సీనగర్‌లో అయ్యప్పపూజ నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీకాంత్ చారి త్యాగం మరువలేనిది

-ఎస్ఐ ప్రణేయ్ తేజ్ రెడ్డి



**మొయినాబాద్, డిసెంబర్ 03, ప్రభాతవార్త :**
60 ఏండ్ల తెలంగాణ కలను నిరవేర్చే క్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమానికి దాసోజ్ శ్రీకాంత్ చారి ఉద్యమానికి ఊపిరి పోశాడని మొయినాబాద్ ఎస్ఐ ప్రణేయ్ తేజ్ రెడ్డి అన్నారు, శనివారం మొయినాబాద్ మండల చౌరస్తాలోని జయ శంకర్ సార్ విగ్రం ఎదుట తెలంగాణకు మలిదశ ఉద్యమ తోలి అమరుడు శ్రీకాంత్ చారి చిత్రపటానికి ఘనంగా నివాళ్ళు అర్పించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు మొయినాబాద్ ఎస్ఐ ప్రణేయ్‌తేజ్‌రెడ్డి హాజరయ్యారు, దాసోజ్ శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సహకారానికి శ్రీకాంత్ చారి త్యాగం ఎంతో గోప్పదని, శ్రీకాంత్ చారి త్యాగం మరువలేదన్నారు,ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న 108 సిద్బిందికి సన్మానం ఏర్పాటు చేశారు, ప్రాణాలు కాపడడంలో 108 సిబ్బంది కీలకపాత్ర పోషిస్తుందన్నారు, 108 సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందించారు, విశ్వబ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో నివాళ్ళు అర్పించి జోహార్ శ్రీకాంత్ చారి జోహార్ అంటు నినాదాలు చేశారు, ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మసంఘం అద్యక్షులు రాంపల్లి సంతోష్ కుమార్ చారి, కార్యదర్శి రమేష్ చారి, మాజి అద్యక్షులు క్రిష్ణమ్మచారి, సినియర్ పాత్రికేయులు వడ్ల రవిందర్ చారి, కార్యావర్గ సభ్యులు కమ్మరి శ్రీనివాస్ చారి, జగదీశ్వర్ చారి, సుదర్శన్ చారి, నర్సింహచారి, తధితరులు పాల్గోన్నారు.



తలకొండపల్లి శ్రీకాంత్ చారి వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

**తలకొండపల్లి మండలంలో**
**తలకొండపల్లి డిసెంబర్3 ,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంత్ చారి వర్ధంతి వేడుకలను ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి హాజరైన పౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.అనంతరం శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా మండల యువకులకు క్రికెట్ వాలీబాల్ కిట్టును అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ నరేందర్ గౌడ్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్,భరత్ రెడ్డి,విజయ్,బొల్లం శివ,కొండల్ జగన్ మల్లయ్య,యాదగిరి,శీను,ఈసారి శ్రీకాంత్,యాదయ్య, బాలకృష్ణ,నాగరాజు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## యాచారంలో ఘనంగా ప్రపంచ వికలాంగ దినోత్సవం



ఫోటో: వికలాంగులను సన్మానిస్తున్న ఎంపిపి కొప్పు సుకన్య, ఎంపీడీవో విజయలక్ష్మిలు

**యాచారం, డిసెంబర్ 3 ప్రభాతవార్త**
ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎంపిపి కొప్పు సుకన్య, ఎంపిడివో విజయలక్ష్మిల ఆధ్వర్యంలో దివా ్యంగులను శాలువాలతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి వికలాంగుల దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. దివ్యాంగుల సంక్షేమానికి కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయన్నారు. నెలవారీ పెన్షన్‌తో పాటు అర్హత కలిగి, అవసరమైన వారికి రాయితీలు కల్పించడంతో పాటు బ్యాటరీ సైకిల్, ఇతర పరికరాలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వికలాంగులు పాల్గొన్నారు.

## గట్టుఇప్పలపల్లి గ్రామంలో టిఆర్ఎస్ సమావేశం



శ్రీనివాసును సన్మానిస్తున్న నాయకులు

**తలకొండపల్లి డిసెంబర్3,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి కొరకు చర్చించుకోవడం జరిగింది.అనంతరం రైతు కో ఆర్డినేటర్ చొప్పరి శ్రీనివాసుని సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ వెంకటయ్య,మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ శిరీష కృష్ణయ్య,పార్టీ అధ్యక్షుడు రాజు,వైస్ ప్రెసిడెంట్ జంగయ్య,రేణురెడ్డి,మాజీ ఎంపిటిసి వెంకటయ్య, కృష్ణయ్య,రాజేందర్,మచ్చేందర్,కెఆర్ కిషన్,జి.నరసింహ,రవీందర్, పురుషోత్తం,యాదయ్య,చొప్పరి నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు అందరూ తోడ్పాటునందించాలి: ఎంపిపి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి సుదర్శన్‌రెడ్డి పాల్గొని మాటాకలడారు. ఈసందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు ఆయన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. వికలాంగులు నిరుత్సాహపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తూ తాము అనుకున్న లక్ష్యాలు సాధించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని శిక్షణ, ఉపాధి కార్యక్రమాలను పొంది ఆర్థికంగా అభివృది చెందాలన్నారు. వికలాంగులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఏ డిపిఎం ప్రభాకర్, లత, ఎంపిఎం మాధురి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జయశ్రీ, ఎన్‌హెచ్‌ఈ అధ్యక్షులు రవి, వార్డుసభ్యులు బేలె సురేశ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public hereby informed that **V.LEELA RANI W/O. V.KRISHNA RAO** aged about 35 years, Occ. House Wife, R/o. H.No.5-36, Tara Nagar, Serilingampally Village, Serilingampally Mandal, Ranga Reddy District., has approached the Shriram City Union Finance Ltd., Chanda Nagar Branch, Hyderabad., by put her documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections, Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned **V.LEELA RANI W/o. V.KRISHNA RAO,** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the Agriculture dry land in Survey No.294, extent Ac.0-12 Guntas (Out of extent Ac.1-00 Guntas), Situated at Kokat Village, with in the limits of G.P., Kokat, Yalal Mandal, Ranga Reddy District., and bounded by: **NORTH:** Land of Gopi Soni. **SOUTH:** Road. **EAST:** Vendor Remaining Land & Grave Yard. **WEST:** Land of Papaiah Goud.

**Sd/- R.VENKATESHWAR RAO, B.A., L.L.B.,**
Advocate, & Panel Advocate of SHRIRAM CUFL. 5-3-29, Near Ramalayam Temple, Kukatpally, Hyderabad – 72.
**Cell.:9391093566, 8519985749**
**Email Id: Venkateshwarraoadv@gmail.com**

## అర్హులైన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

-ఎంఆర్ఓ షర్మిల



ఓటరు నమోదు కార్యక్రమంలో ఎంఆర్ఓ షర్మిల

**బొంరాస్‌పేట్, డిసెంబర్3, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల తహసీల్దార్ షర్మిల మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమంను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతి,యువకులు ఓటు హక్కు కోసం తమ పేరును నమోదు చేసుకోవాలని అన్నారు.కొత్త ఓటరు నమోదు ఆవకాశంను ప్రతి ఒక్కరు చేసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో ఆర్ఐ రవిచారి,గ్రామ పెద్దలు అంజిల్‌రెడ్డి,యువకులు మల్లేష్‌గౌడ్,అంగన్‌వాడి టీచర్స్,పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ నిలిపివేత

**కోట్‌పల్లి, డిసెంబర్ 03, ప్రభాతవార్త :** తాండూర్ సబ్ స్టేషన్ పరిధిలోని కోట్‌పల్లి, బంట్వారం, మండలంలోని ఆదివారం నాడు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్తు నిలిపివేయడం జరుగుతుందని కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ లైన్‌మెన్ రాజు, తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు 220,కేవి132,కేవి 33,కెవి, సబ్ స్టేషన్ పీటీఆర్ ( ట్రాన్స్‌ఫరం )సిఫ్టింగ్ వర్కు మరమ్మత్తుల గాను విద్యుత్తు నిలిపి వేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు,

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎంపిటీసి



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు.

**బొంరాస్‌పేట్, డిసెంబర్3, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ నిధులతో నూతన సిసి రోడ్డుపనులను శనివారం నాడు ప్రారంభించడం జరిగిందని ఎంపిటీసి శ్రావణ్‌గౌడ్ అన్నారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధులతో గ్రామంలోని 3వ వార్డుమెంబర్ తట్టేపల్లి మైనోజిత్ అధ్వర్యంలో కోత్తగా రూ.3లక్షలతో నూతన సిసి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎన్నడు జరగని విధంగా ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ,కోఆప్షన్ మెంబర్ ఖాజ మైనుద్దీన్,ఉపసర్పంచ్ అంజి, యుత్ మండల అధ్యక్షులు మహేందర్,ముస్తాక్,పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య,ఎఫ్ఎస్ సలాం,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

-మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్

**కోట్‌పల్లి, డిసెంబర్ 03, ప్రభాతవార్త** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్ అన్నారు. శనివారం నాడు తాండూర్ శాసన సభ్యులు పైలట్ రోహిత్‌రెడ్డి గారి ఆదేశాల ప్రకారం కోట్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు కోట్‌పల్లి మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు ఓ.చంద్రకళకు 30,వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ.సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా పేద ప్రజలకు అనారోగ్య రీత్యా ఖర్చు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వడం ఎంతో సంతోషంచదగిన విషయం అని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ ఆనంద్, సీనియర్ నాయకులు లక్కాకుల మల్లేశం,సమ్మయ్య,మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి లాలప్ప, లింగంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు అనంతరెడ్డి, కోట్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యక్షులు మోసిన్, ప్రధాన కార్యదర్శి సుశీల్‌కుమార్, యువజన సంఘం అధ్యక్షులు మంగలి నాగేష్, ఉప్పరి నారాయణ,జి నరసింహులు,బుగ్గాపురం గ్రామ ఇంచార్జీ నర్సింలుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కాచవాని సింగారాన్ని సందర్శించిన ఎంపిపి సుదర్శన్ రెడ్డి



కాచవాని సింగారంలోని పల్లె ప్రకృతి వనాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మండలంలోని కాచవాని సింగారం గ్రామాన్ని ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి శనివారం సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంతో పాటు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా పాఠశాలల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు కేంద్ర ప్రభుత్వానివి అయితే కొందరు రాష్ట్ర ప్రభుత్వానివని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉండటం పట్ల ఆసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను కేటాయించడం లేదని అన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డితో కలిసి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి పర్యవేక్షించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్రె జంగమ్మ, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి దుబ్బాక వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కొత్తూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :** కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల జాతీయ రహదారి ప్రక్కన పెంజర్ల బస్‌స్టాప్ వెనుక గల ధరణి ప్లాంట్ వెంచర్ ప్రహరీ గోడ పక్కన దాదాపు 30 నుండి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి శవమై కనిపించాడు. కొత్తూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....శనివారం మధ్యాహ్నం దాదాపు మూడుల గంటల ప్రాంతంలో స్థానికంగా పందుల పెంపకం చేపట్టే శివ వ్యక్తి వాటి కోసం తిరుగుతుండగా దుర్వాసన రావడంతో దగ్గరికి వెళ్లి చూడగా నీలిరంగు ప్యాంటు ఎరుపు రంగు షర్ట్ ధరించిన గుర్తుతెలియని పురుషుడు శరీరం కుళ్లి పోయింది. వెంటనే అతడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజాపాలనలో తెలంగాణ దేశానికే దిక్సూచి

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- టీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

**షాద్‌నగర్, డిసెంబర్ 3, (ప్రభాతవార్త) :** ప్రజాపాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని మిగితా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని, ప్రతి సంక్షేమ పథకాన్ని 100 శాతం ప్రజలకు అందిస్తున్న ఘనత మన తెలంగాణ రాష్ట్రానికి ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన సుమారు 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమాక్షంలో ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో టీఆర్ఎస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని, ప్రజలకు వంద శాతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత మన తెలంగాణకే దక్కుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా పార్టీలో చేరుతున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని, పాత, కొత్త అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రజలకు సేవల చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మరింత సుపరిపాలన అందిస్తారని అన్నారు. అనంతరం పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

# ఎత్బార్‌పల్లి గ్రామంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ

-భక్తితోనే మానవునికి మనశాంతి : ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్, డిసెంబర్ 03, ప్రభాతవార్త :** మానవునికి దైవ భక్తితోనే మనశాంతి లభిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు, శనివారం మొయినాబాద్ మండలంలోని ఎత్బార్‌పల్లి గ్రామంలో మాల దరించిన అయ్యప్ప స్వాముల సన్నిధానంలో చింతకింది ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల మహ పడి పూజ నిర్వహించారు. కందవాడ ఉమాశంకర్ రెడ్డి గురుస్వామి వేదపండితులు పూజా కార్యాక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి నైవేధ్యంతో పాటు మహ మంగళారతి ఇచ్చారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ... మానవ మనుగడకు, మంచి తనానికి దైవ్యం ఎంతో పని చేస్తుందన్నారు. మానవ మనుగడకు భక్తి లేకపోతే సమాజం అస్తవ్యస్తమౌతుందన్నారు, ప్రవీణ్ రెడ్డి స్వాములకు అన్నదానం ఏర్పాటుచేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నధాన కార్యక్రమానికి ప్రారంబించారు, ఈ కార్యక్రమంలో ఎత్బార్ పల్లి సన్నిధాన స్వాములు, భాస్కర్ రెడ్డి, వెంకటేష్, ప్రవీణ్ గౌడ్, మహేందర్, నరేష్ , అనీల్, అయ్‌లేష్, మాజి ఎంపీటీసి రవిందర్, గ్రామస్దులు, భక్తులు, టీఆర్ఎస్ నాయకులు గుండాల రాజు తధితరులు, పాల్గోన్నారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరు

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** విద్యార్థులు తమ లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుగోలగుతారని విద్యావేత్త డాక్టర్ కన్నెగంటి రమేష్ అన్నారు. శనివారం తాండూరులోని శాలివాహన డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యకిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని తులసిగార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా విద్యావేత్తలు డాక్టర్ కన్నెగంటి రమేష్, డాక్టర్ పల్లవి, డాక్టర్ సురేష్ కొండేజులు పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, రాజనీతిశాస్త్రం, ప్రభుత్వ పరిపాలనశాస్త్రం అదితర అంశాలపై అమూల్యమైన సందేశాన్ని అందించారు. ఈ సందర్బంగ వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో సునిశితమైన జ్ఞానం ఉంటుందని, వారి మేధోశక్తిని చక్కగా వినియోగించుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించుటకు చాలా సులభమని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించకొని ముందుకు సాగితే మంచిఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కష్టపడి చదివి విద్యావంతులై ఇటు దేశానికి, చదువుకున్న కళాశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సోమరితనాన్ని వీడి చైతన్యవంతమై శ్రద్దతో, ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని విద్యార్థులకు ఉద్బోదించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శరత్ చంద్ర, కరస్పాండెంట్ అనురాధ, రమేష్, డైరెక్టర్ సిద్దిలింగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

## ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు



నూతన విద్యుత్ స్థంబాన్ని ఏర్పాటు చేయిస్తున్న చైర్మన్,కౌన్సిలర్

**కొడంగల్, డిసెంబర్ 3ప్రభాతవార్త** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్ యాదవ్‌లు తెలిపారు.శనివారం పట్టణంలో వివిధ వార్డుల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను వారు పరిశీలించారు.ఈ సందర్బంగా మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణలో భాగంగా వడ్డర్‌గల్లీలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా రోడ్డు మద్యలో ఉన్న విద్యుత్ స్థంబాన్ని తొలగించాలని సంభందిత శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడం జరిగిందన్నారు.ఈ క్రమంలో చెర్మేన్ జగదీశ్వర్‌రెడ్డి,కౌన్సిలర్‌లు మధుసుదన్‌యాదవ్,రమేష్‌లతో పాటు పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్‌లు దగ్గరుండి రోడ్డు మద్యలో ఉన్న విద్యుత్ స్దంబాన్ని తొలగించి కొత్త స్దంబాన్ని వేయించినట్లు తెలిపారు.

## అసైన్డ్ డిఎస్ పెండింగ్ కోసం దరఖాస్తులు చేసుకోవాలి

**యాచారం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** ధరణిలో నమోదై ఉండి డిజిటల్ సైన్ పెండింగ్‌లో ఉన్న అసైన్డ్ భూమి రైతులందరూ మీ సేవలో ధరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ సుచరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో గ్రీవెన్స్ ఆఫ్ ల్యాండ్ మేటర్ వెబ్‌సైట్‌లో వివిధ రకాల ప్రభుత్వ భూములను ధరఖాస్తు చేసుకుని డిజిటల్ సైన్ పొంది పట్టా పాస్‌బుక్ నందు ఇస్తారన్నారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్ కృష్ణవేణి రవీందర్‌రెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 3. ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణవేణి రవీందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సామ్యంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఓటు హక్కును పొందాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు కేంద్రంలో ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బిఎల్‌వోలు సుందర్‌రెడ్డి, స్వప్న, వార్డు అధ్యక్షుడు ప్రతాప్,నాయకులు పాండు గుప్తా,కిరణ్ పాల్గొన్నారు.

**16వ వార్డులో :** మేడ్చల్ మున్సిపాలిటిలోని 16వ వార్డులో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ ఉమా నాగరాజు పాల్గొని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అదే విదంగా ఓటరు జాబితాలో సవరణ, ఇంటి చిరునామా మార్పు తదితర వాటి కోసం కూడ ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుడు నాగరాజు, ఆర్పీలు స్వరూప, అనిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీఓ డాక్టర్ ఆంజనేయులు



విజేతలైన దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ

**కొందుర్గు, డిసెంబర్ 3, (ప్రభాతవార్త) :** మానసికంగా ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొవద్దనే ఆశయముంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డాక్టర్ ఆంజనేయులు దివ్యాంగులను కోరారు. శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా హాజరై గత రెండు రోజులుగా ఉమ్మడి మండలాల దివ్యాంగుల విద్యార్థులకు నిర్వహించిన ఆటపాటల పోటీల్లో విజేతలయ్యిన వారికి ఆయన బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఐఈఆర్పీ జయ మ్మ, దళిత వాడ పాఠశాల హెచ్ఎం ప్రేమ్‌సాగర్, సీఆర్పీలు కాళీదాసు, నరేందర్,ఎంజేఎస్ చిత్రలతోపాటు దివ్యాంగులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

**తలకొండపల్లి డిసెంబర్3,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన జాజాల యాదయ్య ఇటివల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జాజాల యాదయ్యకు 5వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్,మేక భరత్ రెడ్డి,బల్కం శివ,బోయ కిషన్,శ్రీశైలం,కానుగుల జంగయ్య,శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల ధర్నాను విజయవంతం చేయాలి

**కొడంగల్ రూరల్, డిసెంబర్ 3 (ప్రభాతవార్త):** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పట్టణాధ్యక్షుడు నయీం, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తార్యానాయక్, నాయకులు శంకర్‌నాయక్ తదితరులు పిలుపునిచ్చారు. శనివారం వారు కొడంగల్‌లో విలేకరులతో మాట్లాడుతూ టీఆర్ఎస్ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టే ధర్నాలో కొడంగల్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## నూతన కమ్యూనిటీ ఆసుపత్రి నిర్మాణం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నూతన కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే.

**షాద్‌నగర్, డిసెంబర్ 3, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో సుమారు 20.89 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిని పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... పనులలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ఎక్కడ కూడా నాణ్యత లేకుండా పనులు చేయవద్దని కంట్రాక్టర్‌కు, ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు. అన్ని పనులను దగ్గరుండి చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించడానికే ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంకాయల నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

**బొంరాస్‌పేట్, డిసెంబర్3, ప్రభాతవార్త :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో సిపీఎస్ పాఠశాల,బాపల్లితాండ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాటాడుతూ వికలాంగులకు ప్రభుతం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటుగా అదనంగా వారిలో మనోబలం పెంచాలని,వారికి అవసరమైన పరికరాలను వెంటనే ప్రభుత్వం అందించాలన్నారు.దివ్యాంగులకు ఉపాధ్యాయులు పుస్తకాలు,స్వీట్లు,చాక్లెట్లు పంచిపెట్టి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూర్యనాయక్,ప్రధానోపాధ్యాయులు కాశీపతి,అనిల్ కుమార్,రాంశ్రీనివాస్ బాబు,సిఆర్‌పి నర్సింలు, వేణుగోపాల్, తదితరులు పాల్గోన్నారు.

## 5వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా



భూగర్బ మురికి కాలువ పనులకు శంకుస్దాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్,కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్

**కీసర, డిసెంబరు3, ప్రభాతవార్త:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అభివృద్దికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు.శనివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని లక్ష్మీనగర్ ఫేస్ 3లో మున్సిపల్ సాదారణ నిధులు 10 లక్షలతో భూగర్బ మురికి కాలువ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్బంగా చైర్మన్ మాట్లాడుతూ వార్డులోని నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని అన్నారు.మున్సిపల్ నిధులు మరిన్ని కేటాయించి వార్డులోని వివిద కాలనీలను దశల వారిగా అభివృద్ది చేస్తానన్నారు.మున్సిపల్‌లోని అన్ని కాలనీలలో కోట్ల రూపాయలతో అభివృద్ది చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమీషనర్ స్వామి,డిఈ సుమతి,కో ఆప్షన్ సభ్యులు రజిని వినయ్‌కుమార్, కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్,నాయకులు వినయ్‌కుమార్,గణేష్,పోలు నవీన్‌గౌడ్,నర్సింగ్‌చారీ,తిరుపతిరెడ్డి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అక్బరుద్దీన్ షా దర్గాలో ఘనంగా గంథోత్సవాలు

- హాజరైన పట్టణ ప్రముఖులు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వీర్లపల్లి శంకర్, తదితరులు

**షాద్‌నగర్, డిసెంబర్ 3, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని నాగులపల్లి రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద దర్గా సయ్యద్ ఆక్బరుదనఈనద్ షా దర్గాలో శుక్రవారం రాత్రి గంథోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్, ఫరూఖ్‌నగర్ మండల ఎంపీపీ ఖాజాఇద్రీస్, పట్టణ ప్రముఖులు తదితరులు హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్బంగా జామే మస్జీద్ దగ్గర నుంచి ర్యాలీగా గంథాన్ని దర్గాకు తీసుకొచ్చి పూలతో, చాదర్‌లతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా వద్ద ఏర్పాటు చేసిన భక్తి గీతాల ఆలపణలో మిలాద్ నాతే షరీఫ్ గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ రిజ్వాన్ పాషా ఖాద్రీ, మునవర్ అలీ హాఫీజ్, కోఆప్షన్ మెంబర్ గౌస్‌జానీ, మైనార్టీ నేత జమ్రుత్‌ఖాన్, ఏజాజ్ అడ్డు, సయ్యద్ జాఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబర్‌ఖాన్‌అలీ, బాలరాజ్‌గౌడ్, జర్నలిస్టు ఇలియాస్, మునీర్, మజాహర్, ఖదీర్, ఆశోక్, రషీద్, హమేద్, ఎజాస్, సజాద్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల రిమాండ్

**పెద్దేముల్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల పరిధిలోని ఇందూరులో గత నెల 30న జరిగిన గోరెమియ్యా హత్య కేసులో నిందితులైన మహబూబ్ జానీ,ముంతాజ్ భేగంలను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. కన్న కొడుకైన గోరెమియ్యాను స్వంత తండ్రి అయిన మహబూబ్ జానీ అతి కిరాతకంగా హత్య చేసిన సంగతి తెలిసిందే, కేసు విచారణ చేసిన అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సిఐ రాంబాబు, ఎస్ఐ రవూఫ్ తెలిపారు.




నిందితులను చూపుతున్న పోలీసులు